కథ

విివాహమైన కొత్తలోనే సరళ భర్తతో తనకు మొక్కలు పెంచుకోవాలని ఉందని చెప్పింది. "దానికేముంది! ఇంటిముందు కావల్సినంత చోటుంది. ఇష్టమొచ్చినన్ని మొక్కలు పెంచుకో" అన్నాడు భర్త.

"మామూలు మొక్కలు కాదు. బొన్సాయ్ వృక్షాలంటే నాకు చాలా ఇష్టం. వాటిని పెంచడం ఎలాగో నేర్పే క్లాసులకి కూడా వెళ్లాను. వాటిని మన డ్రాయింగ్‌రూంలో పెంచుతాను" అంది సరళ. సరే నీ ఇష్టమన్నాడు భర్త.


సరళ బొన్సాయ్ మొక్కను పెంచడానికి ఏర్పాట్లు చేస్తున్నప్పుడే మునిసిపాలిటీవాళ్లు సరళ ఇంటిముందు ఒక మొక్కను నాటి దానికి ట్రీగార్డ్ ఏర్పాటు చేశారు.

"నువ్వు పెంచే మొక్కలతోపాటు వీధిలో మొక్కకు కూడా నీళ్లు పోస్తూ ఉండు. అది పెద్దదైతే మనకు కావల్సినంత నీడ" అన్నాడు సరళ భర్త. సరేనంది సరళ.

000

# మరుగుజ్జు వృక్షాలు

— పాలంకి సత్య



పక్కపక్క ఇళ్లలో ఉండే లక్ష్మికీ, సరస్వతికీ ఒకేసారి ఆడపిల్లలు పుట్టారు. సరస్వతి కూతుర్ని చూసి మురిసిపోయింది. అయ్యో ఆడపిల్లా అనుకుంది లక్ష్మి.

అడుగులకి అరిసెలూ, పలుకులకి చిలకలూ పంచిపెట్టకపోయినా చాలా అపురూపంగా సరస్వతి కూతురు సరోజను పెంచింది. లక్ష్మికూతురు కుమారి, సరోజా ఒకే స్కూల్లో చేరారు. ఇద్దరూ తెలివైనవాళ్లే. పోటీపడి చదివేవారు. క్లాసులో ఫస్టురాంకు ఇద్దరిలో ఒకరికి తప్పని సరి.

పదేళ్లు గడిచాయి.

000

పేరంటం నుంచి తిరిగి వస్తున్నప్పుడు కుమారి తల్లితో, "అమ్మా, నాక్కూడా తాంబూలం ఇచ్చారమ్మా. మామూలుగా పెద్దవాళ్లకు తాంబూలం, చిన్న పిల్లలకు పండూ ఇస్తారు కదా. నేను పొడుగ్గా ఉన్నాను కదా. నన్నూ పెద్దదాన్ననుకుని తాంబూలం ఇచ్చారు" అని సంబరంగా చెప్పింది.

"చాల్లే సంబరం. పొడుగ్గా ఉన్నావని పదేళ్లకే బస్సుల్లోనూ, రైళ్లల్లోనూ ఫుల్ టికెట్ కొనిపిస్తున్నారు. ఆ ఖర్చుముందు ఈ తాంబూలం ఏ మూలకి?" అంటూ కూతురి ఎదుగుదలని తీసిపారేసింది.

కుమారి చిన్నబుచ్చుకుంది.

000

సరళ నేర్పుగా బొన్సాయ్ మొక్క వేళ్లనీ, కొమ్మలనీ కత్తిరించింది. వీధిలో మొక్కకి నీళ్లు పుష్కలంగా పోసింది.

000

ఇంకో అయిదేళ్లు గడిచాయి. కుమారి, సరోజా ఇంటర్మీడియెట్లో చేరారు. సరోజ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షలకు కోచింగ్ క్లాసుల్లోకూడా చేరింది. కుమారిని కూడా కోచింగ్‌కి పంపమని లక్ష్మితో చెప్పింది సరస్వతి.

"అయ్యబాబోయ్ ఆడపిల్లకి ఇంజనీరింగ్ చెప్పించడమే. ఇంజనీరింగ్ చదివిందంటే అంతకన్నా ఎక్కువ చదివినవాణ్ణి మొగుడిగా తేవాలి. అందుకు

తగినంత కట్నం సమకూర్చుకోవాలి. ఏదో చచ్చీచెడీ పెద్ద సంబంధం చేశామే అనుకో. అంత పెద్ద ఇంట్లో వెళ్లి వడ్డ పిల్లలు మనమాట వింటారా. మన పెట్టుపోతలకి సంతోషిస్తారా? పిల్లలని మన చెయ్యి దాటి పోనివ్వకూడదు బాబూ"

గట్టిగా అన్న ఈ మాటలు కుమారికి వినబడ్డాయి. తల్లిని తను కూడా కోచింగ్‌కి వెడతానని అడుగుదామన్న ఆలోచనను ఆ పిల్ల విరమించుకుంది.

000

సరళ నేర్పుగా బొన్సాయ్ మొక్క వేళ్లనీ, కొమ్మలనీ మరోసారి కత్తిరించింది. వీధిలో మొక్క బాగా ఏపుగా ఎదుగుతోంది.

000

కుమారి, సరోజా ఇంటర్మీడియెట్ పాసయ్యారు. కుమారికి సరోజకన్నా ఎక్కువ మార్కులొచ్చాయి. ప్రిన్సిపాల్ తమ కాలేజీలో ఫస్టు వచ్చిన కుమారిని అభినందించింది. కుమారి తల్లితండ్రులని కాలేజికి పిలిపించి "మీ అమ్మాయి ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ రాయకపోయినా ఫరవాలేదు. ఆ అమ్మాయి మార్కులకి పిలానీలోని కాలేజీలో ఆమె కోరుకున్న బ్రాంచిలో సీటు వస్తుంది. తప్పకుండా చేర్పించండి. అలాంటి అమ్మాయి మా కాలేజీలో చదవడం మాకు గర్వకారణం" అన్నాడు.

లక్ష్మి తండ్రి భార్యతో "అమ్మాయిని పిలానీలో చదివిద్దామా" అని భయపడుతూనే అడిగాడు. ఇంట్లో లక్ష్మిదే పెత్తనం. ఆమె ఖరాఖండిగా "చాల్లెండి సంబరం. నేను కాబట్టి మీతో నెగ్గుకొస్తున్నాను. ఇంజనీరింగ్‌లో చేర్పిస్తే ఇంక పిల్ల మన చెయ్యిజారిపోయినట్లే. డిగ్రీయేనా లేకపోతే పెళ్లవదు కాబట్టి చదివిద్దాం" అని చెప్పింది.

సరోజకు ఐ.ఐ.టి.లో సీటు వచ్చింది. ఆమె ఇంజనీరింగ్‌లో కుమారి బి.ఎస్.సిలో ఒకేసారి చేరారు.

000

మూడేళ్లు గడిచాయి. ఉదయాన్నే పేపరు తీసుకుని చూసిన కుమారి లోపలకు పరిగెత్తుకుంటూ వచ్చింది.

"అమ్మా ఇదిగో చూడు. యూనివర్సిటీ ఫస్ట్ వచ్చానమ్మా నేను. పేపర్లో వేశారు." అంటూ మురిసిపోయింది. ఆనందంతో ఊగిపోతున్న ఆమె కొంచెం గట్టిగానే మాట్లాడింది.

"చాల్లే సంబడం. ఆడపిల్లవి కావూ. ఏమిటా గంతులు? ఒద్దికగా ఉండటం నేర్చుకో. మధ్యాహ్నం నీకు పెళ్లిచూపులు. స్వీటూ, హాటూ తయారీలో నేను సతమతమవుతుంటే పేపరు చదవడానికి తీరికెక్కడ? ఎంతసేపూ చదువు, చదువు అని కూచోక పోతే కాస్త వంట నేర్చుకోరాదూ" అని గట్టిగా తిట్టింది.

కుమారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.


"మాట్లాడితే ఏడుపొక్కటి. నీ మంచికోసమేగా నేను చెప్పేది..." లక్ష్మి దండకం సాగిపోయింది.

000

సరళ నేర్పుగా బొన్సాయ్ మొక్క వేళ్లనీ, కొమ్మలనీ కత్తిరిస్తూనే ఉంది. వీధిలో మొక్క తనంత తానుగా ఎదిగి చెట్టయింది.

000

చదువు విషయంలో తల్లిని ఎలాగూ తృప్తిపరచలేకపోయాను కనుక వంటయినా నేర్చుకుని తల్లి మెప్పు పొందాలనుకుంది కుమారి. ఒకరోజు అతిథులు వచ్చినప్పుడు వెజిటబుల్ ఫ్రైడ్‌రైస్‌ని పుస్తకంలో చదివి చేసింది.



అతిథులందరికీ పెట్టింది.

అతిథులు బాగుందని అనేవాళ్లేమో కానీ అంతకుముందే లక్ష్మి "నేను చేసిన పులిహార ముందు ఇదేపాటి. పులిహార ఊరిన కొద్దీ రుచి. ఈ ఫ్రైడ్ రైస్ దేముంది" అంది.

000

కుమారి పెళ్లికి, సరోజకి అమెరికా చదువుకి వీసాకి ఒకేసారి ముహూర్తాలు కుదిరాయి. కుమారి పెళ్ళై అత్తవారింటికి వెళ్లింది. సరోజ పై చదువులకి అమెరికా వెళ్లింది.

000

శ్రావణమాసం వచ్చింది. లక్ష్మి సరస్వతి ఇంటికి వచ్చింది. "కుమారి చేత యథావిధిగా నోము నోపిస్తున్నాను. అది నామాట జవదాటదు. నీకు అప్పుడే చెప్పాను. ఆడపిల్లకు ఎక్కువ చదువు చదివిస్తే వాళ్ళు మన చెయ్యి దాటిపోతారని. కుమారిని చూడు. నేను అదుపాజ్ఞలతో పెంచాను. నా మాట అది విని తీరుతుంది. నువ్వు పిల్లని అమెరికా కూడా పంపావు. నీ పిల్ల ఇంక నీకు లేనట్లే."

సరస్వతి మాట్లాడకుండా లోపలకు వెళ్లి ఒక ఉత్తరం తీసుకొచ్చి లక్ష్మి చేతిలో పెట్టింది. ఉత్తరంలో "అమ్మా, నా ఎమ్.ఎస్. డిగ్రీ పూర్తియింది. వచ్చే నెల ముప్పైన కాన్వకేషన్. అమ్మా, నీకు శుభవార్త ఏమిటంటే రెండేళ్ల కోర్సుని నేను తొమ్మిది నెలలలో పూర్తిచేశాను. క్లాసులో మొదటి విద్యార్థిగా ఉన్నాను. అందుకని మీ ఇద్దరికీ నా కాన్వకేషన్‌కి వచ్చే ఏర్పాట్లు మా ఇన్‌స్టిట్యూట్‌వాళ్లే చేస్తున్నారు. నువ్వు, నాన్నా తప్పకుండా రండి. అయ్యో మధ్యతరగతి వాళ్లమన్న బెంగవద్దు. మీ వీసాకీ, విమానం ఖర్చులకీ కూడా ఇన్‌స్టిట్యూట్ వాళ్లదే పూచీ. మీ వంటి మంచి తల్లితండ్రులకి పుట్టడం నా అదృష్టం..."

సరోజు ఉత్తరం సగమే చదివిన లక్ష్మి ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

000

సరళ పెంచిన బొన్సాయ్ మొక్క డ్రాయింగ్ రూంలో అతిథులకి కనువిందు చేస్తూ సరళకి మెప్పుకోలుని సంపాదించి పెడుతోంది. సరళ ఇంటి ముందు మొక్క మహావృక్షమై సరళ ఇంట్లోని వారికే కాక మరెందరికో చల్లని నీడనిస్తోంది.

బొన్సాయ్ మొక్కకే కళ్లుంటే నీళ్లు కార్చేది కాదా? తల్లితండ్రుల కారణంగా ఎందరు కుమారులు బొన్సాయ్ మొక్కలుగా మిగిలిపోతున్నారో? ■